క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ మురళి, తదితరులు

హుకుంపేట: మండలంలోని సూకురు గ్రామంలో జరగనున్న సీతారాముల కళ్యాణ మహోత్సవముల సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను సర్పంచ్ దనసాని మురళి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని, యువత క్రీడా రంగంలో మొగ్గుచూపాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు విశ్వనాథం, చిట్టిబాబు, బుజ్జిబాబు, ధనుంజయ వాసుదేవ్, సన్యాసి, సోంబాబు, గజపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నేడు



ఎంపీడీవో లాలం సీతయ్య

చింతపల్లి: ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. సమావేశంలో నాడు–నేడు, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, కన్సిస్టెంట్ రిథమ్స్ ఇన్ స్కూల్స్ సంబంధించి మండలంలో హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సీడీపీవో, ఏటీడబ్లూవో, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ కుమార్‌బాబు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఎస్‌ఐ కుమార్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహన రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహన రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది పురేందర్ తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎటపాక: మండలంలోని చోడవరం గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఓలం ఫుడ్ ఇన్‌గ్రీడియన్‌డింట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.6లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు సంస్థ ప్రతినిధులు అనిల్, పవన్‌గణేష్ తెలిపారు. సర్పంచ్ పాడియం మణి, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, సింజెన్‌టా నాగేశ్వరావు, రైతులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలిస్తున్న ఎంఈవో రామచంద్రరావు

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ, బిల్లాపుట్టు గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలలను ఎంఈవో రామచంద్రరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బిల్లాపుట్టు పాఠశాలలో రాగిజావను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎంవిలీయం కేరి తదితరులున్నారు.

నైపుణ్యం ..ఆదాయ మార్గం

- అక్వేరియం చేపల పెంపకంపై శిక్షణ
- రూ.2 లక్షల పెట్టుబడితో వ్యాపారం చేసేందుకు అవకాశం



తయారు చేసిన అక్వేరియం



శిక్షణ పొందుతున్న యువత

రంపచోడవరం: గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం విశేష కృషి చేస్తోంది. ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన అనేక శిక్షణ ఇస్తున్నారు. కేంద్రం ద్వారా తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, మిల్లెట్ బిస్కెట్స్ తయారీ, పనసతో విలువ ఆధారిత ఉత్పత్తులు, చేపలతో పచ్చళ్లు తయారీ వంటి అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చారు. తాజాగా 30 మంది యువతకు అక్వేరియం తయారీ, చేపల పెంపకం, ఉత్పత్తిపై ఐదు రోజులపాటు శిక్షణ పూర్తయింది.

గృహాలంకరణలో భాగం అక్వేరియం

ఇంట్లో ఓ ప్రత్యేకాలంకరణగా అక్వేరియం భాగమైంది. ఇటీవల కాలంలో వాస్తు ప్రకారం అక్వేరియంలను ఇళ్లల్లో ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో అక్వేరియం మార్కెట్‌కు డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో అక్వేరియం ద్వారా చేపల పెంపకం, ఉత్పత్తిపై ప్రాధాన్యత సంతరించుకొంది. ఈ మేరకు కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ వీరాంజనేయులు జాతీయ మత్స్య సలహా మండలి సహకారంతో కేవీకెలో అక్వేరియం–చేపల పెంపకం–ఉత్పత్తి అంశంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందుకోసం అక్వేరియం తయారీ, రంగుల చేపల పెంపకం విషయంపై అనుభవం ఉన్న కె.రవికుమార్‌తో శిక్షణ ఇప్పించారు. శిక్షణలో భాగంగా అక్వేరియంల తయారీ (వివిధ సైజులు) వాటిలో ఉపయోగించే అలంకరణ వస్తువులు, లైట్లు ఏర్పాటుతో చేపల ఉత్పత్తిపై శిక్షణ ఇచ్చారు.

స్వయం ఉపాధిపై దృష్టి



ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. అక్వేరియం తయారీలో ఐదు రోజుల శిక్షణ పొందాను. శిక్షణలో అక్వేరియం తయారు, చేపల ఉత్పత్తి వంటి అన్ని విషయాలపై అవగాహన కల్పించారు. దీంతో సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని అనుకుంటున్నాను. స్వయం ఉపాధి పొందాలనుకుంటున్నాను.

– సుజాత, రంపచోడవరం

తక్కువ పెట్టుబడితో వ్యాపారం



తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకోవచ్చు. రూ. 2లక్షల నుంచి రూ.4 లక్షల వ్యయంతో అక్వేరియం తయారీ వ్యాపారం ప్రారంభించవచ్చు. మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఎలాంటి సాంకేతిక సహకారం కావాలన్నా ఉచితంగా అందిస్తాం. ఇప్పటికే అనేక మందికి శిక్షణ ఇచ్చాం.

– కె రవికిరణ్, రాష్ట్ర అక్వేరియం తయారీ అసోసియేషన్ కార్యదర్శి, కాకినాడ

గిరి విద్యార్థులకు బాసటగా పోలీసు శాఖ



గూడెంకొత్తవీధిలో పాలిసెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్

గూడెంకొత్తవీధి: ప్రేరణ కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి బాసటగా నిలచి వారికి తగిన తోడ్పాటును అందిస్తోందని జీకే వీధి సీఐ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు మంగళవారం గూడెం కొత్తవీధిలోని పలు విద్యాలయాల్లో ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీ యాజమాన్యం పాలిసెట్ నమూనా పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉచితంగా శిక్షణ ఇస్తామని సీఐ తెలిపారు. విద్యార్థులకు తమ పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొయ్యూరు: పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల సహకారంతో పాలిసెట్ మోడల్ పరీక్ష నిర్వహించారు. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో మంప, కొయ్యూరు ఎస్‌ఐలు లోకేష్‌కుమార్, రాజారావు పర్యవేక్షించారు. పరీక్షకు 493 మంది విద్యార్థులు హాజరయ్యారు. మోడల్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉచిత శిక్షణ, వసతి సదుపాయం కల్పిస్తామని సీఐ స్వామి నాయుడు చెప్పారు.

క్షయపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగప్రత్యూష

అడ్డతీగల: మండలంలోని అచ్చియ్యపేటలో ఎల్లవరం వైద్యాధికారి నాగప్రత్యూష మంగళవారం క్షయ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి నివారణపై అవగాహన పెంచుకోవాలన్నారు. తరచూ దగ్గు వస్తున్నా లేదా రాత్రిళ్లు జ్వరం వంటివి వచ్చినా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. క్షయ వ్యాధి వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ విజిటర్ అప్పలనర్సమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సుజన, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్య అభ్యసించాలి



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బూసిగూడెం బాలికల పాఠశాలలను ఎంపీపీ బందం శ్రీదేవి మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ఉన్నత విద్య అభ్యసించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల పరీక్షలపై ఒత్తిడికి గురికావద్దన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు, పెన్నులు, పౌచ్‌లు అందజేశారు. పది ఫలితాల్లో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా పారితోషకం ఇస్తామన్నారు. ఎంపీటీసీలు కుంజం వంశీ, సింగోజి కృష్ణకుమారి , మాజీ ఎంపీపీ సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, చిన్నబ్బాయి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

జి.మాడుగుల: వంతాల పంచాయతీ తోటమామిడి గ్రామంలో గిరిజన రైతుకు సంబంధించిన ఎద్దు మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడకక్కడే మృతి చెందింది. తోటమామిడి గ్రామం గెమ్మెలి బుజ్జిబాబుకు చెందిన ఎద్దు సోమవారం సాయంత్రం మేతకు వెళ్లి తిరిగి వస్తుండగా సమీపంలో గల విద్యుత్ స్తంభానికి చెందిన వైర్‌కు తగులుకొని షాక్‌కు గురై మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు బుజ్జిబాబు కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి సెక్టార్ పరిధిలో గల పెదగూడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తల్లిబిడ్డ తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎ.లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న విలువైన పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో అధిక దిగుబడులు



సీడ్‌బాల్స్ తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ అప్పలరాజు

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురంలో రైతులకు ప్రకృతి సేద్యంపై సీఆర్పీ అప్పలరాజు మంగళవారం అవగాహన కల్పించారు. వేసవి దుక్కులు చేయడంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పలు రకాల వ్యవసాయ పద్ధతులను వివరించారు. గోంగూర, జనుము, బెండ తదితర విత్తనాలను మట్టి ముద్దల్లో పెట్టి సీడ్‌బాల్స్ తయారు చేసుకోవాలని సూచించారు. పొడి దుక్కులు పూర్తికాగానే వాటిని పొలంలో వెదజల్లుకోవాలని సూచించారు.

పీఎంపీలకు శిక్షణ తరగతులు



శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు పొందిన పీఎంపీలు

రంపచోడవరం: పీఎంపీ (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్స్) జిల్లా అధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, జిల్లా కార్యదర్శి బళ్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (కాకినాడ), అల్లూరి జిల్లా ప్రాథమిక వైద్య సేవకులకు మూడు రోజుల ఫస్ట్ ఎయిడ్ శిక్షణ తరగతులు నిపుణుల సహకారంతో మంగళవారం నిర్వహించారు. డాక్టర్, ఎన్‌సీ పరాశర , ట్రైనర్ సత్యనారాయణ పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆరుగురు ప్రాథమిక వైద్యులు జి.రవికుమార్, ఎస్.ఎస్.వరప్రసాద్, పి.నాగేంద్ర, పి.రమేష్, సీహెచ్.విశ్వేశ్వరరావు, కె.వాసిరెడ్డి తదితరులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి శివకుమార్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రాథమిక వైద్యులు జగదీశ్వరరావు, సిల్వెస్టర్, సత్యనారాయణ, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ



వంట సామగ్రి అందజేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో సీఆర్పీఎఫ్ డీ–141 బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం సివిక్‌యాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యానగరం, మద్దిగూడెంకు చెందిన కొండరెడ్డి గిరిజనులకు బియ్యం, నీటి డ్రమ్ములు, వంట సామగ్రి అందజేశారు. కమాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు సీఆర్పీఎఫ్ కృషి చేస్తోందన్నారు. సెకండ్ ఇన్ కమాండెంట్ కమల్‌వీర్ యాదవ్, సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, సర్పంచ సవలం సత్తిబాబు పాల్గొన్నారు.

'బుల్లికొండలు' ఎంపికపై హర్షం

గంగవరం : బీజేపీ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా ఈక బుల్లికొండలు ఎంపికయ్యారు. ఈ మేరకు మండలానికి చెందిన నాయకులు పోతురాజుదొర, చిన్నారావు, శ్రీను, రమేష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: కురిడి పంచాయతీ జాకరవలస గ్రామంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఆయన గ్రామస్తులతో మాట్లాడి గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించాలన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

'నాడు చంద్రబాబు తీర్మానం చేసినప్పుడు మీరేం చేశారు'

గూడెంకొత్తవీధి: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ నాడు చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేసినప్పుడు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న మీ నోరు మూగబోయిందా అని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని ఉద్దేశించి వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆనాడు గిరిజన ఎమ్మెల్యేగా ఉండి దీన్ని ఎందుకు వ్యతిరేకించలేదని మండిపడ్డారు. జనసేన , బీజేపీ ప్రభుత్వం దేశంలోని 15కులాలను గిరిజన జాబితాలోకలపాలని చెబుతున్నారన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించాలన్నారు.

ఆయా పోస్టుల గడువును పెంచాలి

మారేడుమిల్లి: చావడికోట పంచాయతీ పరిధిలోని బొడ్లంక గ్రామంలో అంగన్‌వాడీ ఆయా పోస్టుకు గడువును పెంచాలని చావడికోట సర్పంచ్ ప్రేమ్ కుమార్‌రెడ్డి ప్రకటనలో కోరారు. ఐసీడీఎస్ అధికారులు విడుదల చేసిన నోటిఫికేషన్ గురించి గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. గ్రామంలో 18 మంది చదువుతుకున్న వివాహిత మహిళాలు ఉన్నారన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి నోటిఫికేషన్ గడువును పెంచాలని సర్పంచ్ కోరారు.

నిబంధనల మేరకు వేలంపాట



సీతగుంటలో ఆశీల వేలంపాటలో పాల్గొన్న జెడ్పీటీసీ బొంజుబాబు, ఈవోఆర్‌డీ నర్సింగరావు

పెదబయలు: మండల కేంద్రంలో సీతగుంట పంచాయతీ పరిధిలోని పెదబయలు వారపు సంత ఆశీల వేలంపాట కార్యక్రమం జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, పంచాయతీ విస్తరణాధికారి నర్సింగరావు, సర్పంచ్ పలాసి మాధవరావు ఆధ్వర్యంలో జరిగింది. మండలం పరిధిలోని 13 మంది వేలంపాటలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ రూ.1లక్ష నుంచి పాట ప్రారంభించారు. సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు గ్రామానికి చెందిన పసుపుల నైకంబాబు రూ.3,03,000లకు దక్కించుకున్నారు. జెడ్పీటీసీ బొంజుబాబు, ఈవోపీఆర్డీ నర్సింగరావు మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఆశీల గడువు ఉంటుందన్నారు. ఆశీల నిధులు గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కొంత వాటా కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల అనుగుణంగా వసూలు చేయాల్సి ఉందన్నారు. పాత ధరలే వసూళ్లు చేయాలని ఎక్కువగా వసూళ్లకు పాల్పడిన నిబంధనల ప్రకారం ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే రద్దు చేసే అధికారం పంచాయతీకి ఉందన్నారు. సంతలో తాగునీటి తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని వార్డు సభ్యుడు గందేరు జీవనకుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరయ్య, సచివాలయం కార్యదర్శి రవిరాజు, వార్డు సభ్యులు, వేలంపాటదారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఎంపీపీ బందం శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ నరేష్

రంపచోడవరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందించి రోగుల్లో నమ్మకాన్ని కలిగించాలని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి అన్నారు.ఆసుపత్రికి వచ్చిన రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందించాలన్నారు. పెదగెద్దాడ, వాడపల్లి పీహెచ్‌సీల్లో మంగళవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు సక్రమంగా ఖర్చు చేయాలన్నారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.ఎంపీటీసీ సభ్యులు బచ్చల మంగమ్మ, వంశీ కుంజం, సర్పంచ్‌లు కొమరం పండుదొర, అన్నిక పండమ్మ, మాజీ ఎంపీపీ అరగాటి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, గంగరాజు, ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాల నిర్వహణపై సమావేశం



సమావేశమైన గ్రామపెద్దలు

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ గ్రామంలో భీమలింగేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవాలు ఏప్రిల్ 8, 9, 10 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు లకే చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉక్కుర్బ, ఇసుకగరువు, ఒంటిపుట్టు, రాకసిరాయి, పొదిలి, పత్రిమెట్ట తదితర గ్రామల పెద్దలు సమావేశమైనట్టు చెప్పారు. ఉత్సవాలకు అరుకు, పాడేరు ఎమ్మెల్యేలతో పాటు వివిధ రంగాల ప్రముఖులు, పీఠాధిపతులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు తెలిపారు. ఆలయ వార్షికోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఎంపీటీసీ సభ్యుడు పరదాని భీమలింగేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

31న మన్యం బంద్

అరకులోయ రూరల్/అనంతగిరి/గంగవరం/అడ్డతీగల/మారేడుమిల్లి/చింతూరు: అరకులోయ, మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అఖిల పక్షం సమావేశంలో నాయకుడు రామారావు దొర మాట్లాడుతూ మన్యంలో 31న చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అరకులోయ రూరల్, అనంతగిరి, గంగవరం, అడ్డతీగల, మారేడుమిల్లి, చింతూరు తదితర ప్రాంతాల్లో అఖిల భారత ఉద్యోగుల సంఘం నాయకులు గురుదొర, సన్యాసిరావు, జేఏసీ సంఘం నాయకుడు సిద్దూ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు బాబూరావు, గిరిజన సంఘం నేతలు రామారావు, శాంతిరాజు, సిరిమల్లిరెడ్డి, సుబ్బారావు, సురేష్, చిన్నంరెడ్డి, నారాయణ, రాజ్‌కుమార్, కృష్ణయ్య, సీతారామయ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బోయ, వాల్మీకి తెగలను ఎస్టీ జాబితాల్లో చేర్చొద్దని డిమాండ్‌తో బంద్ చేపడుతున్నామన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



రాజవొమ్మంగిలో పూజలు చేస్తున్న భక్తులు



పాడేరులో ఘటాలు మోస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: గ్రామంలో ప్రజలంతా సంతోషంగా ఉండాలని గ్రామపెద్దలు పూర్వం నుంచి ఆచారంగా నిర్వహిస్తున్న అమ్మతల్లి పండగతో పాతపాడేరులో సందడి నెలకొంది. మంగళవారం ఉదయాన్నే గ్రామపెద్దలు గ్రామచావిడి వద్ద ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఊరి పొలిమేర వరకు అమ్మతల్లి ఘటాన్ని ఊరేగించారు. పొలిమేర వద్ద చిన్న పందిరి వేసి అమ్మతల్లికి పసుపు, కుంకుమ సమర్పించుకున్నారు.

సీతారాముల కల్యాణ ఉత్సవాలు ప్రారంభం

జి.మాడుగుల: మండల కేంద్రంలో గల రామాలయంలో ఆలయ ధర్మకర్త, మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు అధ్వర్యంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు మత్స్యరాస వెంకటగంగరాజు, సింహాచలంరాజు, రెడ్డిబాబు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా రామాలయంలో గురువారం సీతారామ కల్యాణ మహోత్సవం, అనంతరం భారీ అన్న సమారాధన, పురువీధుల్లో థింసా నృత్యాలు, కోలాటాలు డప్పువాయిద్యాలతో ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందన్నారు.



జి.మాడుగులలో ముస్తాబైన రామాలయం

శివునికి ఏకాదశ రుద్రాభిషేకం

రాజవొమ్మంగి: వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం శివునికి ఏకాదశ రుద్రాభిషేకం, తదితర పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. భారీ అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని స్థానిక కోదండ రాముల వారి ఆలయం, రామాలయంలలో చలువ పందిర్లు వేశారు. స్థానిక షిర్డీ సాయిబాబావారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

భారీ అన్న సమారాధన

అనంతగిరి: నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా ఆలయం వద్ద వర్తక సంఘం ఆధ్వర్యంలోని భక్తులు అన్నసమారాధన నిర్వహించారు.